సాక్షి
ప్రకాశం
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



భార్యాభర్తల గొడవలో పసికందు బలి
భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఎలుకల మందు తిని తన ఇద్దరు పిల్లలకు పెట్టడంతో 8 నెలల పసికందు మృతిచెందింది.
- 8లో..



బాధితులకు న్యాయం చేయాలి
స్పందనలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
35/28

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాగభైరవ సాహిత్య పురస్కార విజేతలు వీరే

ఒంగోలు మెట్రో: నాగభైరవ సాహిత్య పురస్కారం 2023 కోసం కథా సంపుటాలను ఆహ్వానించగా వచ్చిన పుస్తకాల్లో ముగ్గురు కథా రచయితలను విజేతలుగా న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసినట్లు నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ సోమవారం తెలిపారు. రూ.10 వేల మొదటి బహుమతికి సింహప్రసాద్ (125 బహుమతి పొందిన కథలు), రూ.5 వేల రెండో బహుమతికి శీలం సురేంద్ర (పార్వేట), రూ.2 వేల ప్రత్యేక బహుమతికి కాశీ నాగేంద్ర (నల్ల వంతెన)ను ఎంపిక చేశారన్నారు. ఈనెల 20వ తేదీ ఆదివారం ఒంగోలులో నిర్వహించే సభలో విజేతలను సత్కరించనున్నట్లు చెప్పారు.

డీ వార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (డీ వార్మింగ్ డే)ను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్పందన భవనంలో కలెక్టర్ దినేష్ కుమార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వారితో పాటు కిశోర బాలలకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ 400ఎంజీ మాత్రలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో పిల్లలకు మాత్రలు దగ్గరుండి వేయించాలన్నారు. మాత్రలు పంపిణీ చేసే సమయంలో మరుగుదొడ్లు వినియోగించిన తర్వాత చేతుల శుభ్రపరుచుకునే విధానంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. నులిపురుగులు ఉండటం వలన కలిగే నష్టాలను పిల్లలకు వివరించాలన్నారు. దీనిలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, టీబీ నివారణ అధికారి సురేష్‌కుమార్, డాక్టర్ భగీరథి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవోదయ పోస్టింగ్‌లో వాదంపల్లి విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్



బాలకృష్ణ

యర్రగొండపాలెం: ఆల్ ఇండియా స్థాయిలో నవోదయ విద్యాలయ సమితి నిర్వహించిన ఉపాధ్యాయ ఎంపికలో మండలంలోని వాదంపల్లి గ్రామానికి చెందిన మద్దినేని బాలకృష్ణ తెలుగు విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న నవోదయ విద్యాలయంలో థర్డ్ లాంగ్వేజ్ టీచర్స్ (టీజీటీ) పోస్టులు భర్తీ చేసేందుకు గత సంవత్సరం నవంబరు 29న పరీక్షలు నిర్వహించారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో మైసూర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ నెల 28న ఫలితాలను ప్రకటించారు. పెద్దారవీడు మండలంలోని కుంటలో ప్రాథమిక విద్య, ఇంటర్ నుంచి బీఈడీ వరకు తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో ఆయన విద్యను అభ్యసించాడు. నవోదయ ఎంపికలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన బాలకృష్ణను ఆ గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ మొదటి సెమిస్టర్ తరగతులు

ఒంగోలు: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ టెస్టు 2023, కౌన్సిలింగ్ ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఆగస్టు ఒకటో తేదీ నుంచి డాక్టర్ వైఎస్ఆర్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కాలేజీ మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు త్వరితగతిన తరగతులకు హాజరుకావాలన్నారు.

డీవీసీ సెల్ లీగల్ కౌన్సిలర్‌గా మేడికొండూరి గార్గేయి



మేడికొండూరి గార్గేయి

ఒంగోలు: డొమెస్టిక్ వయొలెన్స్ యాక్టు సెల్ లీగల్ కౌన్సిలర్‌గా మేడికొండూరి గార్గేయిని నియమిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవీ కాలం ఏడాదిపాటు ఉంటుంది. నెలకు రూ.35 వేలు వేతనం అందిస్తారు. స్త్రీ శిశు సంక్షేమశాఖలో వీరు లీగల్ కౌన్సిలర్‌గా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

మూడు దశాబ్దాల నిరీక్షణకు మోక్షం..

- భూమి కొనుగోలు పథకం భూములపై రుణాలు మాఫీ
- రైతులకు మేలు చేసేలా 2009లో జీవో ఇచ్చిన వైఎస్ఆర్
- మహానేత మృతితో ఆ జీవోను అటకెక్కించిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు
- తండ్రి ఇచ్చిన జీవోను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్
- దళిత రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన బాలినేని
- జిల్లాలో 3,794 మంది ఎస్సీ రైతులకు లబ్ధి
- టీడీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిపొందిన వారికి కూడా ఊరట
- ఆగస్టులో రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వనున్న సీఎం

భూమి కొనుగోలు పథకం కింద భూములు కొనుగోలు చేసి దశాబ్దాలుగా పడుతున్న అవస్థల నుంచి దళిత రైతులకు విముక్తి కల్పించారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. ఆ భూములపై ఉన్న రుణాలను మాఫీ చేసి వారికి పూర్తి హక్కును కల్పిస్తున్నారు. పూర్తిగా రుణాలు చెల్లించి నిషేధిత భూముల జాబితాలో ఉన్న వారికి సైతం లబ్ధి చేకూర్చారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లాలోని 3,794 మంది రైతులకు మేలు జరగనుంది. ప్రభుత్వం తీసుకున్న తొలి అడుగు ఈ జిల్లా నుంచే పడడం గమనార్హం.



ఎస్సీ రైతులకు భూమి కొనుగోలు పథకం రుణ మాఫీ గురించి వివరిస్తున్న ఈడీ శ్రీనివాస్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకంలో 1988–89 ఆర్థిక సంవత్సరంలో భూముల కొనుగోలు పథకం కింద ఎస్సీ రైతులు భూములు కొనుగోలు చేశారు. అయితే వారి బకాయిలు బ్యాంకుల్లో పెండింగ్ ఉండి పోవడంతో రైతులు ఇబ్బంది పడుతూ వచ్చారు. ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఉన్నప్పుడు ఈ పథకంలో ఉన్న లబ్ధిదారులకు రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి రూ.లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తూ 2009 జూలై 7వ తేదీన జీఓ ఆర్‌టీ నంబర్–492 ను విడుదల చేశారు. ఆ మహానేత అకాల మరణంతో తరువాత ఆ జీఓను కాంగ్రెస్, టీడీపీ పాలకులు అటకెక్కించారు. వైఎస్సార్ ఇచ్చిన జీఓకు మోక్షం కల్పించారు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో తాకట్టులో ఉన్న భూములకు విముక్తి కలిగించనున్నారు.

బాలినేని చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా...

రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఈ రుణమాఫీ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు పూనుకున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అన్ని జిల్లాల్లో వైఎస్ఆర్ ఇచ్చిన జీఓను అమలు చేస్తే భూమి కొనుగోలు పథకంలో లబ్ధిపొందిన ఎస్సీ రైతులకు మేలు జరుగుతుందని ఆయన సీఎంకు వివరించారు. దానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అప్పట్లో ఉన్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హర్షవర్ధన్‌ను ఈ అంశంపై వెంటనే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. దీంతో జిల్లాల వారీగా లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. తొలుత జిల్లా నుంచి లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమాన్ని 2022 సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న తూతిక శ్రీనివాస విశ్వనాథ్ వేగంగా చేపట్టారు. వెనువెంటనే లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. తనఖా నుంచి విముక్తి కలిగించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సంప్రదింపులు కూడా జరిపారు. జిల్లాలో 3,217 ఎకరాలను 3,794 మంది ఈ పథకంలో భూములు కొనుగోలు చేశారు. అందులో 165 ఎకరాలకు సంబంధించి బకాయిలు పూర్తిగా చెల్లించారు. అయినా వారి భూములు కూడా తనఖా నుంచి విడుదల కాలేదు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారికి కూడా ప్రయోజనం చేకూరనుంది.



భూమి కొనుగోలు పథకంలోని ఎస్సీ రైతుల నుంచి వివరాలు తీసుకుంటూ..(ఫైల్)

టీడీపీ హయాంలోని ఎస్సీ లబ్ధిదారులకూ ఊరట...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్ద మనసుతో తన తండ్రి ఇచ్చిన జీఓ ప్రకారం మొన్నటి టీడీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిపొందిన ఎస్సీ రైతులకు కూడా ఊరట కలిగిస్తున్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాల్లో ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన ఎస్సీ రైతులకు కూడా రుణ మాఫీని అమలు చేస్తున్నారు. టీడీపీ హయాంలో ఆ రెండేళ్లలో మాత్రమే ఈ పథకాన్ని అమలు చేసింది. వాస్తవానికి వైఎస్ఆర్ జీఓ ప్రకారం 1988–89 సంవత్సరం నుంచి ఈ పథకంలో రుణం తీసుకొని తిరిగి చెల్లించని లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. అప్పటి నుంచి 2007–08వ సంవత్సరం వరకు రుణాలు చెల్లించని వారికి రుణ మాఫీ చేయటానికి వైఎస్ జగన్ ప్రభుత్వం కసరత్తు చేసి అమలు చేస్తోంది.

“ప్రతి ఒక్కరికీ మేలు చేసేలా ప్రభుత్వం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ మేలు చేసేలా అడుగులు ముందుకేస్తోంది. అణగారిన వర్గాలను అన్ని విధాలా ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ తన పని తాను చేసుకెళ్తున్నారు. 35 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన జీవోను కూడా అమలు చేస్తున్నారంటే ముఖ్యమంత్రికి ప్రజల పట్ల ఎంతటి ఉదార స్వభావం ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఎస్సీ రైతుల భూమి కొనుగోలు పథకాన్ని ఇన్ని సంవత్సరాల తరువాత అమలు చేయటం ఆయన సేవకు నిదర్శనం. మధ్యలో చంద్రబాబు నాయుడు మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేశారు. కనీసం ఎస్సీ రైతుల సమస్యలు గుర్తుకు కూడా రాలేదంటే వారి పట్ల, పేదల పట్ల ఆయనకు ఉన్న అభిప్రాయం ఏమిటో రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.

– బాలినేని శ్రీనివాస రెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే

మైనింగ్ డాన్ గొట్టిపాటి

- నువ్వు పులి కాదు..పిల్లి
- రెండు సింహాలు కొట్టుకుంటుంటే మధ్యలో గెలిచావ్
- తెలుగు మాట్లాడటం రాని లోకేష్‌కు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హతే లేదు
- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి: డొక్కు అంబాసిడర్ వేసుకుని తిరిగే ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మైనింగ్ డాన్‌గా మారి కోట్లకు పడగలెత్తాడని శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ అద్దంకి సభలో మాట్లాడిన మాటలను ఖండిస్తూ ఒంగోలులోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ తెలుగు భాష సరిగా మాట్లాడటం రాని లోకేష్‌కు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కనీసం ఒక సారైనా గెలిచి మాట్లాడితే ప్రజలు హర్షిస్తారన్నారు. “మీకేదో అప్పుడే అధికారం వచ్చినట్లుగా రెడ్ బుక్‌లో పేర్లు రాసుకుంటున్నా మీ సంగతి చూస్తానని, పోలీసులను అధికారులను బెదిరిస్తున్నావు. నేను మూర్ఖుడనని నీవే చెప్పుకుంటున్నావు. ఎవరైనా మూర్ఖుడిని నాయకునిగా పెట్టుకుంటారా” అని ప్రశ్నించారు. సైకిల్‌ను ఢీకొట్టగలిగే దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఒక పిల్లి లాంటి నాయకుడిని లోకేష్ పులి అంటున్నాడని.. ఆయన రెండు సింహాలు కొట్టుకుంటుంటే మధ్యలో గెలిచాడన్నారు. రాజకీయ భిక్ష పెట్టిన మా నాన్నను, రాజశేఖరరెడ్డిని మరచిపోయిన వ్యక్తి అతడు అని అన్నారు.

ద్వారాలు తెరవకనే ఊరుకున్నావు..

“నేను ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీ మారలేదంటున్నావు. కాంగ్రెస్ నుంచి కేసులు మాఫీ చేసుకోవడానికి కాదా పార్టీ మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన మొదట్లోనే నీవు పార్టీలో చేరాలని ప్రయత్నించలేదా? ద్వారాలు తెరవకనే ఊరుకున్నావు. మాయమాటల సంగతి ప్రజలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మంచి నీటి పథకంలో భాగంగా మల్లవరం నుంచి నీరు అద్దంకి తేవడానికి ప్లాంటు శింగరకొండ దగ్గర పెట్టడం రూ.5 కోట్ల కమీషన్ కోసం కాదా? మేము వచ్చిన తరువాత రీ ఎస్టిమేషన్ వేయించి రూ.12 కోట్లు మిగిల్చాం. అద్దంకిని అభివృద్ధిని చేసింది మేము. నాలుగేళ్ల క్రితం పట్టణం ఎలా ఉంది. నేడు ఎలా ఉందో జనం అందరికీ తెలుసు. అబద్ధాలు చెబితే ఎవరూ నమ్మరు. నీవు ఇప్పించలేని ఈనాం భూములకు పాస్‌పుస్తకాలు ఇప్పించాం. నీ వల్ల కాని వేలమూరిపాడు రోడ్డు మేము వేయించాం. మల్లాయపాలెం వాసులను అధికారంలో ఉన్న సమయంలో ఖాళీ చేయించాలని బెదిరించింది నీవు కాదా? ఇంత చేసి మేము చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉంది. రాబోయే ఎన్నికల్లో నీవు పులివా..పిల్లివా తెలిసిపోతుంది. నిన్ను గతంలో కాపాడిన సింహాలే నిన్ను కొట్టబోతున్నాయి. ఈ సారి నీవు ఓడిపోవడం ఖాయం” అని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను ఉద్దేశించి అన్నారు. సమావేశంలో బల్లికురవ మండల కన్వీనర్ చింతల పేరయ్య, కొరిశపాడు, జే పంగులూరు మండలాల నాయకులు మస్తాన్‌రావు, శ్రీనివాసరెడ్డి, చింతా రామారావు, సంతమాగులూరు జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, పీడీసీసీబీ డైరక్టర్ సోనీ, కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

ఆహా ఏమి రుచి..

- రేషన్ బియ్యంతో చేసిన వంటకాల ప్రదర్శన
- వంటకాలను రుచి చూసిన కలెక్టర్ దినేష్ కుమార్
- రేషన్ బియ్యంపై అపోహలు సరికాదని వెల్లడి



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్, జేసీ

ఒంగోలు అర్బన్: ప్రభుత్వం పేదలకు సరఫరా చేస్తున్న విటమిన్ డీ–12, ఫోలిక్‌యాసిడ్, ఐరన్ కలిగిన ఫ్లోరిఫైడ్ బియ్యంతో మహిళలు చేసిన వంటకాలతో సోమవారం స్పందన భవనం వద్ద జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో వంటకాల పోటీలు, ప్రదర్శన నిర్వహించారు. దీనిలో 58 రకాల వివిధ వంటకాలను మహిళలు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ హాజరై వంటకాలను రుచి చూసి, వాటిని తయారు చేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శన తిలకించిన అధికారులు, ప్రజలు రుచి చూసి ఆహా ఏమి రుచి అంటూ మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ బియ్యంపై వస్తున్న లేనిపోని అపోహలు సరికాదని ఎంతో బలవర్ధకమైన బియ్యం ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక వ్యయ ప్రయాసలు పడి నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేస్తోందన్నారు. రేషన్ బియ్యంతో సరిగా వంట తినలేమని, తిన్నా సరిగా జీర్ణం కాదనే అవాస్తవ ప్రచారాలను నమ్మవద్దన్నారు. రేషన్ బియ్యం నాణ్యత, పోషక విలువలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో జిల్లా స్థాయిలో వంటల పోటీలు పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. రేషన్ బియ్యంతో పులిహోర, పరమాన్నం వంటి సంప్రదాయ వంటలే కాకుండా అరిసెలు, మురుకులు, దోసెలు, గోంగూర రైస్, చలివిడి వంటి అనేక వినూత్నమైన వంటకాలు చేయవచ్చని ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు చూపారన్నారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన నిర్మల, రేణుకలకు ప్రశంస పత్రంతో పాటు రూ.5 వేల నగదు బహుమతి, రెండో స్థానంలో వచ్చిన అనురాధ, సుజాతలకు రూ.3 వేలు, మూడో స్థానం కైవసం చేసుకున్న త్రివేణి, ఝాన్సీలకు రూ.2 వేలు నగదు బహుమతిని కలెక్టర్ అందజేశారు. దీనిలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు ఎంవీఎస్ కృష్ణమోహన్, ఊతకోలు శ్రీనివాసరావు, రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఫ్యామిలీ డాక్టర్‌తో మేలు



నరసాయపాలెంలో వృద్ధురాలిని పలకరిస్తున్న ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్

- ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్

మద్దిపాడు: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచాలకే పరిమితమైన వృద్ధులు, ఇతర రోగులకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఉపయోగకరంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పెదకొత్తపల్లి, నరసాయపాలెం గ్రామాల్లో 104 ద్వారా వైద్యులు ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. గతంలో ధనవంతులకే ఫ్యామిలీ డాక్టర్‌లు ఉండే వారని, అటువంటి పరిస్థితి నుంచి ప్రతి ఒక్కరికీ ఫ్యామిలీ డాక్టర్ ఉండేలా సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి రోగి ఆరోగ్య వివరాలు తెలుసుకుని వారికి సేవలు అందించడమే లక్ష్యంగా చేపట్టారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోఅడుగు ముందుకేసి ప్రతి పేదవానికి నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందించడంతో పాటు మంచం నుంచి లేవలేని వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఇళ్ల వద్దనే పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారన్నారు. 104 వాహనంలో మందులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన పెదకొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లోని పదో తరగతి బాలికల హెచ్‌బీ రిపోర్టులు పరిశీలించి రక్తహీనతతో ఉన్న బాలికలను పిలిచి మాట్లాడారు. రక్తహీనత వలన కలిగే దుష్పరిణామాల గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ముందుగా ఆయన ఏఎన్ఎం నిర్వహిస్తున్న రికార్డులు పరిశీలించారు. వైద్యులకు పలు సూచనలిచ్చారు. ఆరోగ్య శ్రీకి సంబంధించి ఎవరైనా రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటే అటువంటి వారి వివరాలు ఆరోగ్య మిత్రల ద్వారా తన వాట్సప్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట డాక్టర్ జగదీష్ ఏఎన్ఎం వనజాక్షి, ఆశా వర్కర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టులో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

పొదిలి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. విజయవాడలో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది రాయసం ఆదిశేషు విఠల్ హత్యకు నిరసనగా విధులు బహిష్కరించినట్లు న్యాయవాదులు తెలిపారు. ఈ నెల 2వ తేదీ వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ వారు చెప్పారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: ఆర్టీసీ పరిధిలోని వివిధ బస్‌స్టేషన్/బస్ డిపోలలో 9 ఖాళీ ప్రదేశాలను బీఓటీ పద్ధతిలో 33 సంవత్సరాలకు లీజుకు ఇచ్చేందుకు బిడ్లు కోరుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి సుధాకరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తును ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కనిగిరి బస్టాండులో 1950 చదరపు గజాలు కూడా 9 ఖాళీ స్థలాల జాబితాలో ఉందన్నారు. ఖాళీ స్థలాలను లీజు ఇచ్చే పద్ధతిపై అవగాహన కోసం ఏపీఎస్ ఆర్టీసీ, జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో ఈ అంశానికి సంబంధించి ఆగస్టు 1న సాయంత్రం 3 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- ఏర్పాట్లపై సమావేశం నిర్వహించిన కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: రాబోయే 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. ఏర్పాట్లపై సోమవారం స్పందన భవనంలో అన్నీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. వర్షం కురిసినా వేడుకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. స్వాతంత్య్రం దినోత్సవానికి రెండు వారాల సమయం ఉన్నందున ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలిపేలా శకటాలు, శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య అతిథులకు, అతిథులకు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబీకులను ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. వేడుకల ప్రాంగణంలో అల్పాహారం, తాగునీటి సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ శ్రీలత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాదయాత్రకు స్పందన కరువు

- డబ్బు, మద్యం పంచి జనాల తరలింపు
- అయినా అంతంత మాత్రమే..

దర్శి: నారా లోకేష్ యువగళం పాదయాత్రకు స్పందన కరువైంది. పాదయాత్రలో జనాలను చూపించుకోవడానికి టీడీపీ నాయకులు నానా తంటాలు పడుతున్నారు. స్థానికులు యాత్రపై ఆసక్తి చూపకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి మద్యం, డబ్బు ఆశ చూపి వాహనాల్లో జనాలను తరలించారు. పగలు పాదయాత్రకు స్పందన లేక పోవడంతో సాయంత్రం ఆరుగంటల తర్వాత చీకటిపడ్డాక పాదయాత్ర మొదలు పెడుతున్నారు. ఆ సమయంలో అయితే పనులు పూర్తి చేసుకుని ఇంటికి చేరుకుంటారు. మద్యం, డబ్బు ఆశ చూపితే కాస్త ఎక్కువ మంది జనాలను సమీకరించవచ్చని ఎత్తులు వేసినా అవి కూడా పని చేయలేదు. నేడు ప్రకాశం జిల్లాలో నుంచి పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం నూజెళ్ల మండలంలోకి పాదయాత్ర వెళ్తుంది. నియోజకవర్గానికి వచ్చే టీడీపీ నాయకుడే కరువయ్యారు. లోకేష్ నియోజకవర్గానికి వచ్చినా ఇక్కడ నియోజకవర్గాన్ని నడిపించే నాయకుడే లేకపోవడంతో కేడర్ పూర్తిగా డీలా పడింది.

విదేశీ విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై లోకేష్ అసత్య ఆరోపణలు

అర్హులైన విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య నగదు ఇస్తున్నా ముండ్లమూరు సభలో లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేశారు. వ్యక్తిగత కారణాలతో మృతి చెందిన పోలీసు మృతిని కూడా రాజకీయం చేయటంలో భాగంగా నాలుగో సింహం ఏమైందంటూ పోలీసు సంఘాన్ని ఎద్దేవా చేశారు.

ఏరులై పారిన మద్యం:

పాదయాత్ర పొడవునా ఎక్కడ చూసినా వాహనాల్లో మద్యం తాగుతూ కనిపించారు. కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఎమ్మెల్యేలు డోలా బాల వీరాంజనేయస్వామి, ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

5న షూటింగ్ బాల్ సెలక్షన్స్

టంగుటూరు: టంగుటూరు మండలం జమ్ములపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 5వ తేదీన ప్రకాశం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ విభాగంలో బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు సంఘ కార్యదర్శి వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2004 ఏప్రిల్ ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. ఆధారు కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో జమ్ములపాలెం పాఠశాల పీడీ తులిబిల్లి అశోక్‌ను సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 8919591417ను సంప్రదించాలని సూచించారు.

గెజిటెడ్ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా డీపీఓ నారాయణరెడ్డి

● అభినందనలు తెలిపిన పలువురు అధికారులు



డీపీఓను అభినందిస్తున్న కార్యాలయ ఉద్యోగులు

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ గెజిటెడ్ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి నూతనంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం డీపీఓను ఆయన చాంబర్‌లో పలువురు జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్ అలీ, డీఎల్‌డీఓ ఉషారాణి, డీఎల్‌పీఓ పద్మ, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం సిబ్బంది, కార్యాలయ ఏఓ ఎస్.శివప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తాలూకా సీఐ, ఎస్సై సస్పెన్షన్

ఒంగోలు: గిరిజన యువకునిపై మరో యువకుడు దాడిచేసిన ఘటనలో నిందితులపై చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందారంటూ ఒంగోలు తాలూకా సీఐ, ఎస్సైలపై సస్పెన్షన్ వేటు వేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై డి.శ్రీనివాసరావు, సీఐ ఆర్.రాంబాబును సస్పెండ్ చేస్తూ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. దాడి ఘటన మే 19న చోటుచేసుకోగా బాధితుని సోదరుడు అదే రోజు రాత్రి రిమ్స్ ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు. పోలీసులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి చేతులు దులుపుకున్నారే తప్ప సరైన దిశగా దర్యాప్తు చేయడంలో విఫలమయ్యారని ఉన్నతాధికారులు భావించారు. నెలరోజుల తరువాత సామాజిక మాధ్యమాల్లో దాడికి సంబంధించిన వీడియో వెలుగు చూడటం, ఆ తర్వాత హత్యాయత్నం, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంపై విమర్శలు రావడంతో సీఐ, ఎస్సైలను బాధ్యులుగా పేర్కొంటూ సస్పెండ్ చేశారు.

బాధితులకు న్యాయం చేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మలికా గర్గ్



ఎస్పీ చాంబర్ వద్ద వేచిఉన్న ఫిర్యాదుదారులు

● ఎస్పీ మలికగర్గ్

ఒంగోలు సిటీ: స్పందన ఫిర్యాదులను నిర్ణీత కాలపరిమితిలోగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ మలికగర్గ్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి 89 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి అర్జీలు స్వీకరించిన ఎస్పీ.. సమస్యలను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కారిస్తామని భరోసా కల్పించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని ఆదేశించారు.

స్పందన ఫిర్యాదుల్లో కొన్ని

✦ 70 ఏళ్ల వృద్ధురాలినైన తన వద్ద పది రోజులు ఉంటానని చెప్పి వచ్చిన తన అక్క కూతురు వృద్ధాప్య పింఛనుకు దరఖాస్తు చేస్తున్నట్లు నమ్మించి, వేలిముద్రలు వేయించుకొని తనకున్న ఐదు సెంట్ల ఇంటి స్థలాన్ని మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకుందని తాళ్లూరు మండలానికి చెందిన యోగమ్మ అనే వృద్ధురాలు ఫిర్యాదు చేసింది. తనను ఇంట్లో నుంచి గెంటేయడమే కాకుండా ఇల్లు ఖాళీ చేయాలని అడిగితే బెదిరిస్తోందని వాపోయింది.

✦ తన భర్త వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని, భర్తతోపాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఒంగోలుకు చెందిన ఒక మహిళా ఫిర్యాదు చేశారు.

✦ తనకు గవర్నమెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి విజయవాడ తీసుకెళ్లి అక్కడ సోమశేఖర్, మరో ఇద్దరు వ్యక్తుల అకౌంట్‌కు రూ.4,60,000 ట్రాన్స్‌ఫర్ చేయించాడని, ఉద్యోగం ఇప్పించకపోగా కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని ఒంగోలుకు చెందిన షేక్ బాషా అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్) శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, స్పందన ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యాభర్తల గొడవలో పసికందు బలి

- ఎలుకల మందు తిని తన ఇద్దరు పిల్లలకూ పెట్టిన తల్లి
- భర్త వేధింపులు భరించలేకే..
- చికిత్స పొందుతూ 8 నెలల చిన్నారి మృతి
- తల్లీకుమారుల పరిస్థితి విషమం
- టంగుటూరు మండలం కందులూరులో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



మృతి చెందిన అక్షర

టంగుటూరు: భర్త వేధింపులు తాళలేని ఓ మహిళ ఎలుకల మందు తిని తన ఇద్దరి పిల్లలకూ పెట్టడంతో 8 నెలల పసికందు మృతి చెందగా.. తల్లీకుమారుల పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన టంగుటూరు మండలం కందులూరులో రెండు రోజుల క్రితం చోటుచేసుకోగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కందులూరు గ్రామానికి చెందిన అంబటి అనీల్ వృత్తిరీత్యా బేల్దారిగా పనిచేస్తున్నాడు. అతనికి అదే గ్రామానికి చెందిన అనూషతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి అఖిల్(4), కుమార్తె అక్షర(8 నెలలు) కుమార్తె ఉన్నారు. గత కొన్ని నెలలుగా అనీల్ ఏ పనిచేయకుండా మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో గొడవ పడుతూ భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో గత నెల 29న అనీల్ మద్యం సేవించి భార్యను తీవ్రంగా దుర్భాషలాడి కొట్టాడు. దీంతో మనస్తాపం చెందిన భార్య ఎలుకల మందు కొని తన ఇద్దరు పిల్లలకు తినిపించి ఆమె కూడా తినింది. మరుసటి రోజు వాంతులు కావడంతో బంధువులు ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ 8 నెలల పసికందు అక్షర ఆదివారం మృతి చెందింది. తల్లి అనూష, కుమారుడు అఖిల్ పరిస్థితి విషమంగా ఉంది. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేయగా, సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్ కేసును పర్యవేక్షిస్తున్నారన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే బుర్రా



సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, స్థానిక నాయకులు

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ సోమవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ పోతు కొండారెడ్డి, ప్రముఖ న్యాయవాది, పార్టీ సీనియర్ నాయకులు చింతంగుంట్ల సాల్మన్‌రాజు, వాసవీ సత్రసముదాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, ఎం.సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

పదవీ విరమణ వయసు పెంపుపై హర్షం

● సీఎం వైఎస్ జగన్‌ది సాహసోపేత నిర్ణయం
● కృతజ్ఞతలు తెలిపిన ఏకేయూ సిబ్బంది



సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు ప్రకటిస్తున్న ఏకేయూ వీసీ అంజిరెడ్డి తదితరులు

ఒంగోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి వేతనం తీసుకునే బోధనా సిబ్బంది పదవీ విరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ సాహసోపేతమైన నిర్ణయాన్ని సీఎం తీసుకున్నారన్నారు. ఇది రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు ఎంతో ఉపయోగకరమని, వారి పరిశోధనలు సమాజానికి అవసరమని పేర్కొన్నారు. వర్శిటీ రిజిస్ట్రార్ హరిబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం విద్యారంగంలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన నిర్ణయమన్నారు. ఈ స్ఫూర్తితో ఆచార్యులు మరింతగా సేవ చేసి రాష్ట్ర యువతను భావిభారత నిర్మాణకర్తలుగా తీర్చిదిద్దాలని సూచించారు. సీఎంతోపాటు రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యన్నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ కె.శ్యామలరావు, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ హేమచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ డి.వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు గడప వద్దకే సంక్షేమ పథకాలు



ఔరంగబాద్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: వైఎస్సార్ సీపీ పాలనలో గడప వద్దకే సంక్షేమ అందుతున్నాయని ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు అన్నారు. మండలంలోని ఔరంగబాద్, నడింపల్లి గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందని వారుంటే వారి వివరాలు నమోదు చేసుకొని వారికి పథకాలు అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలు, కుల మతాలతో సంబంధం లేకుండా అర్హతే కొలమానంగా ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో రైతులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు సంతోషంగా ఉండటంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లిన తమకు ప్రజలు సంతోషంగా స్వాగతం పలుకుతున్నారన్నారు. విద్య, వైద్య రంగంలో ఎన్నో మార్పులు జరిగాయని, పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య అందడంతోపాటు మెరుగైన వైద్యసేవలందుతున్నాయన్నారు. ఏ ఒక్క అర్హుడికి నష్టం జరగకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

గ్రామ సర్పంచ్ వరికుంట్ల కళావతి, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, తహసీల్దార్ శైలేంద్రనాథ్, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, మాజీ ఏఎంసీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, మాజీ సర్పంచ్ సబ్బసాని సాంబశివారెడ్డి, వరికుంట్ల సుబ్బారావు, ఎంపీటీసీలు ఆనంద్, నాగరాజు, హసీనా, కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య, యల్‌కోట సర్పంచ్ బాష, నాయకులు కొత్తపల్లి శ్రీను, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, కటికల భాస్కర్, గోపి, జమ్ములదిన్నె మధుసుధనరావు, పెద్దకోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల గుండెల్లో దైవం సీఎం జగన్



మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: పేదల సంక్షేమం కోసం వివిధ పథకాలు ప్రవేశపెట్టి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పొదిలి మండలం మాదాలవారిపాలెం సచివాలయం పరిధిలోని రామాయణ కండ్రిక, ఓబులక్కపల్లి గ్రామాల్లో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వచ్చిన అధికారులు, ప్రజా ప్రతినిధులకు స్థానిక నాయకులు కామునూరి వెంకటరావు, ఏడుకొండలు, తిరుపతిరావు, కోవెలకుంట్ల నరసింహరావు, చిరుపల్లి నరిసింహులు, శ్రీహరి, ఆవుల వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యే ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. లబ్ధిదారులు కామునూరి తిరిపాలమ్మ, నందిని,గుండాల రమాదేవి, కోవెలకుంట్ల విజయమ్మ, చిరుపల్లి కోటేశ్వరమ్మ మాట్లాడుతూ.. జగనన్న వచ్చినప్పటి నుంచి తమ కుటుంబాలకు మంచి జరుగుతోందన్నారు. ఇల్లు మంజూరైందని, పింఛను, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. భవిష్యత్తులో మరింత మంచి జరగాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డానియల్‌జోసఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, పీఆర్ ఏఈ మస్తాన్‌వలి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్‌బేగం, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ కె.నరసింహరావు, జేసీఎస్ కన్వీనర్ గొలమారి చెన్నారెడ్డి, గుంటూరి పిచ్చిరెడ్డి, నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, ఓంకార్, ఓబుల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లాపురం నరిసింహులు, అంబవరపు నారాయణరెడ్డి, వార్డు అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, అనుబంధ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి

● అర్జీలు రీ ఓపెన్ కాకూడదు ● స్పందనలో కలెక్టర్ దినేష్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన జేసీ శ్రీనివాసులు, డీఆర్వో శ్రీలత

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు సమస్యలపై అందిచిన అర్జీల తాలూకు సమస్యలు రీఓపెన్ కాకూడదని స్పష్టం చేశారు. ఆ విధంగా చేసినపుడే ప్రజల సంతృప్త స్థాయి పెంచగలుగుతామన్నారు. సమస్యలు పరిష్కరించలేని పక్షంలో అందుకుగల కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూరప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చెన్నయ్య, ఉమాదేవి, లోకేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల తనిఖీ



పెట్రోలు నాణ్యత తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఒంగోలు సిటీ: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ డీజీ ఉత్తర్వుల మేరకు ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఏఎస్పీ భవానీహర్ష ఆధ్వర్యంలో ఒంగోలులోని శ్రీరత్న ఫిల్లింగ్ స్టేషన్, ఎంజీ బ్రదర్స్ ఆటోమొబైల్స్ పెట్రోలు బంకులను సోమవారం తనిఖీ చేశారు. పెట్రోలు నాణ్యతను పరిశీలించామని, నివేదికను ఉన్నతాధికారులకు అంజేస్తామని ఏఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లయ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుపాకీతో కాల్చుకుని వ్యక్తి బలవన్మరణం



సంఘటనా స్థలంలో పాండ్యన్ మృతదేహం



విచారిస్తున్న ఎస్సై సురేష్

చినగంజాం: భార్యాభర్తల మధ్య వివాదంతో ఒక వ్యక్తి నాటు తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు ఆంబరంపేటకు చెందిన పాండ్యన్(27) అనే వ్యక్తి మోటుపల్లి పంచాయతీ పరిధిలో జరుబుల రమేష్‌కు చెందిన రొయ్యల చెరువుల వద్ద కొంతకాలంగా కాపలా ఉంటున్నాడు. స్థానికంగా నక్కలోళ్లుగా చెప్పుకొనే సామాజికవర్గానికి చెందిన పాండ్యన్‌కు ఇద్దరు భార్యలు కాగా రొయ్యల చెరువుల వద్దే కాపురముంటున్నాడు. వారిలో మొదటి భార్య రమ్యది అతని స్వగ్రామం దగ్గరే కాగా, రెండో భార్య తులసిది చిత్తూరు జిల్లా కుప్పం. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం తులసికి పాండ్యన్‌తో ఏర్పడిన వివాదం కారణంగా అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో పాండ్యన్ తను కాపలా ఉండే రొయ్యల చెరువుల సమీపంలో ఉన్న వేపచెట్టు కింద కూర్చుని తుపాకీ(నక్కలోళ్ల దగ్గర ఉండే సింగిల్ బ్యారెల్ గన్)తో కణతకు గురిపెట్టి కాల్చుకొని బలవన్మరణం చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతుడి భార్య రమ్యను విచారించి కొంత సమాచారం రాబట్టారు. ఆమె వాంగ్మూలం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సురేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి ఐదేళ్ల కుమార్తె ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

■ MPHW (F) - ANM (2 Yrs) రెగ్యులర్ నర్స్‌ట్రైనింగ్ & DMLT కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ ఎనీగ్రూప్, SC, ST, BC, OBC లకు స్కాలర్‌షిప్ & హాస్టల్ వసతి కలదు. సంప్ర॥ రూస్సీ నర్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, ఒంగోలు. ✆ 94402 74196 [OA-31]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1496]

Real Estate

TOLET

■ ఒంగోలు టౌన్‌లో అన్నవరప్పాడు-2వ లైన్ (K.B.East ప్రక్కబజారు) 450 SFT ఏరియా గల బిల్డింగ్ కమర్షియల్స్‌కు అద్దెకు ఇవ్వబడును. 2 వీలర్ పార్కింగ్ మాత్రమే ✆ 92900 93616. [O-191554]

WANTED

■ ఒంగోలు టౌన్ నెల్లూరు బస్టాండ్ మరియు ఆర్టీసి బస్టాండ్ మెయిన్‌రోడ్‌కి దగ్గరగా 14అడుగుల ఫేసింగ్‌లో 11గదుల సెమి కమర్షియల్ స్థలం కావలెను. నో బ్రోకర్స్. email: doctorhomeo123@gmail.com [G-786474]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సం॥ ✆ 99121 05656. [O-191557]

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈరోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ (100% జెన్యూన్) సంప్ర :✆ 945 945 3338 [B-362]

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ :
ఒంగోలు
90102 02856
90102 02762

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2408]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781997]

Wanted

■ ఒక్క సంవత్సరం టెలికాలర్స్ వర్క్ చేసిన అనుభవం ఉన్నవారు సంప్రదించండి. (Male) శ్రీ బాపూజీ కాంప్లెక్స్ షాప్ నెంబర్ 45, ఒంగోలు. ✆ 89214 11713. [OA-51]

■ ITI ఇన్‌స్ట్రక్టర్స్ కావలెను. డాన్ బోస్కో ITI, ఒంగోలు. ఎలక్ట్రీషియన్ డ్రాఫ్ట్స్‌మెన్, సివిల్, ఫిట్టర్ & సూవింగ్ టెక్నాలజీ అడ్మిషన్లు ప్రారంభమైనవి. ఆసక్తిగల విద్యార్థులు తేది: 31-07-23లోపు సంప్ర: ✆ 81068 06407, 81975 22118, 94443 28844 principalongoledonbosco@gmail.com [O-191455]

■ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్, ఒంగోలు నందు టెక్నీషియన్‌గా పనిచేయుటకు తప్పనిసరిగా 1సం॥ బ్లడ్ బ్యాంక్ నందు అనుభవం కలిగి DMLT+INTER అర్హత కలిగిన వారు వెంటనే సంప్రదించండి. ✆ 91547 73116. [OA-48]

■ నటరాజ్ జ్యూయలర్స్ నందు పనిచేయుటకు స్టోర్‌మేనేజర్ కావలెను. జ్యూయలరీ నందు అనుభవం తప్పని సరి తెనాలి, చీరాల, విజయవాడ బ్రాంచిల నందు ✆ 91691 68999. [O-787228]

■ శ్రీసరస్వతి విద్యాసంస్థలు ఒంగోలులో పనిచేయుటకు Jr.లెక్చరర్స్(Females only) మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్ట్స్‌కు కావలెను. Q.M.Sc, & లేడీ వార్డెన్స్, క్యాంపస్ ఇన్‌చార్జిలు కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఫ్రీ వసతి + భోజనం కలదు. సంప్ర॥ ✆ 81420 28977, 93986 96141. [O-191451]

■ MRR పెట్రోలియమ్స్, MNR క్యాన్సర్ హాస్పిటల్ ఎదురు ఒంగోలు నందు పనిచేయుటకు (M/F) యువతి/యువకులు కావలెను. ఆ॥జీ॥ కలదు. సంప్ర॥ ✆ 98667 16721, 99661 16288. [O-191454]

■ దేశంలో మొదటిసారిగా రామాయపట్నం పోర్ట్, మెగా ఇండస్ట్రీయల్ హబ్ & ప్రపోజ్ ఎయిర్‌పోర్టుకు దగ్గర "NUDA" అప్రూవల్ వెంచర్స్‌లో మార్కెటింగ్ చేయుటకు ప్రాంతాల వారిగా టీమ్‌లీడర్స్ & ఏజెంట్స్ కావలెను. సంప్ర॥ ✆ 96764 24778. [O-191555]

■ Wanted Spoken English Faculty (ACE Spoken English Academy) ఇంగ్లీష్ నేర్పించి జాబ్ ఇవ్వబడును. సంప్ర॥ డిబ్బలరోడ్, ఒంగోలు. ✆ 99491 13714 [OA-45]

■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో నెలకు 35,000/- వరకు సంపాదించవచ్చు. పార్ట్ / ఫుల్‌టైం. 100% ఎటువంటి ఫీజులు ఉండవు. ఫోన్ : 79956 38002 [V-797249]

■ జీతం-20 వేలు, 8 గం॥ డ్యూటీ సెక్యూరిటీ ఇన్‌ఛార్జిగా మట్టపల్లిలో Ex-ఆర్మీవారు 13,500+OT సెక్యూరిటీ గార్డ్స్ మేళ్ళచెరువులో ఫ్రీ రూం, తక్కువ రేటుకు మీల్స్. ✆ 93469 73791, 86884 17132 [B-246]

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221503]

■ ఫైవ్ స్టార్ ఫ్రైడ్ చికెన్ నందు పనిచేయుటకు స్టాఫ్ కావలెను. మంగమూరు రోడ్, Opp. పెంటలూన్స్, ఒంగోలు. సంప్ర: 9949832832. [C-785940]

■ ఒంగోలు జిల్లా టంగుటూరు దగ్గర ప్రముఖ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీ S.O (Ex.army) & సెక్యూరిటీ గార్డులు కావలెను. సంప్ర॥ ✆ 98489 77496, 92980 11777 [B-1165483]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888 [HA-473]

■ ఒంగోలు, బల్లికురవ, మల్లయపాలెం ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్, సెక్యూరిటి సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. రూమ్ వసతి + భోజనం కలదు. 8985322255, 8500405004 [G-786478]

■ INC ఆఫీస్ నందు పనిచేయుటకు యువతి యువకులు కావలెను. P/T-9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 6300264252 [G-786476]

■ TIK Pvt Ltdలో పనిచేయుటకు M/F కావలెను. అర్హత: 10th to Any Qualification. P/F Time. Sal: 13 to 18k. Age: 18-30 below. Contact: 9384958382 [G-860]

■ Wanted Bank Field Verification Executives: Cumbam, Giddalur, Markapuram, Podhili & Darsi. Further Details Cont: 72888 03402, 77939 10928. [NA-5801]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.